www.prajasakti.com

ప్రజాశక్తి

సోమవారం 19 డిసెంబర్ 2022 | 5 | కాకినాడ



వినియోగదారుల హక్కులపై
24 వరకు అవగాహన వారోత్సవాలు

ప్రజాశక్తి - పెద్దాపురం

వినియోగదారుల హక్కులపై అవగాహన వారోత్సవాలు ఈ నెల 24వ తేదీ వరకు నిర్వహిస్తున్నట్లు వినియోగదారుల సంఘం అధ్యక్షులు భళ్లమూడి సూర్యనారాయణ మూర్తి తెలిపారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ కార్యక్రమాల్లో భాగంగా ఈ నెల 19న స్థానిక సాగర మున్సిపల్ హైస్కూల్లో, 20న జవహర్‌లాల్ నెహ్రూ మున్సిపల్ హైస్కూల్లో, 21న స్థానిక ప్రభుత్వ బాలికోన్నత పాఠశాలల్లో వినియోగదారుల హక్కు లపై సదస్సులు నిర్వహించి ఆయా పాఠశాల విద్యార్థులకు నిర్వహించిన ప్రతిభ పోటీల విజేతలకు బహుమతులు, సర్టిఫికెట్లు పంపిణీ చేస్తామన్నారు. 23న ఆర్‌డిఒ కార్యాలయంలో వివిధ శాఖల అధికారులతో 24న జరిగే వినియోగదారుల దినోత్సవంపై సమీక్ష జరుగుతుందన్నారు.

ఉపాధి కూలీలకు వేతన వెతలు



పనుల్లో నిమగ్నమైన ఉపాధి కూలీలు

- రెండు నెలలుగా అందని కూలి సొమ్ములు - కేంద్రం నుంచి నిధుల విడుదలలో జాప్యం

ప్రజాశక్తి - కాకినాడ ప్రతినిధి


రెక్కాడితేనే గానీ డొక్కాడని వ్యవసాయ కార్మికులకు కష్టాలు తప్పడం లేదు. అరకొర వేతనాలే అయినా... కొర్రో గొప్పో కుటుంబ జీవనానికి ఉపయోగపడుతుందని ఉపాధి హామీ పనులకు వెళుతుంటే అవీ సక్రమంగా అందివ్వని పరిస్థితి నెలకొంది. వాస్తవానికి 15 రోజులకు ఒకసారి వేతనాలు ఇవ్వాల్సి ఉన్నా కేంద్ర ప్రభుత్వ నిర్లక్ష్యం వ్యవహరిస్తూ నిధుల విడుదలలో తీవ్ర జాప్యం చేస్తుంది. దీంతో రెండు నెలలుగా ఉపాధి హామీ పథకం లో పనిచేస్తున్న కూలీలకు వేతనాలు నిలిచిపోయాయి. సకాలంలో కూలి సొమ్ములు అందక కష్టజీవులు అప్పులు చేసి కుటుంబాలను పోషించుకునే పరిస్థితి ఏర్పడింది. మరోవైపు సక్రమంగా పనులు చూపించకపోవడంతో ఆర్థిక ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు. యంత్రాల ప్రవేశంతో వరి కోత పనులు సక్రమంగా దొరకని నేపథ్యంలో వ్యవసాయ కార్మికులకు ఉపాధి కోసం వెతుకులాటలో ఉన్నారు.

కాకినాడ జిల్లాలో సుమారు 4.75 లక్షల జాబ్ కార్డులుండగా 1,48,586 కుటుంబాలకు చెందిన దాదాపు 2.15 లక్షల మంది కూలీలు పని చేస్తున్నారు. ప్రస్తుతం జిల్లాలో ఖరీఫ్ కోతలు జరుగుతున్నాయి.దాంతో రోజాకి సరాసరి సుమారు 14 వేల మంది మాత్రమే పనులు చేస్తున్నారు. రాష్ట్ర ప్రభుత్వం, అధికారులు నిర్లక్ష్యం కారణంగా పథకం సక్రమంగా క్షేత్రస్థాయిలో అమలు కావడం లేదు. వ్యవసాయ కార్మికులను ఆదుకోవడం కోసం ప్రవేశపెట్టిన ఈ కార్యక్రమం క్రమంగా నీరు కారుతోందనే అభిప్రాయం కూలీలు వ్యక్తం చేస్తున్నారు. రోజుకి కేవలం రూ. 257 మాత్రమే కూలీగా వస్తుంది. పెరుగుతున్న ధరలకు అనుగుణంగా కూలి రేట్లు పెరగడం లేదు. మరోవైపు ప్రభుత్వం వారాల తరబడి పెండింగ్లో ఉంచుతుంది. దాంతో పనులు చేసేవారి సంఖ్య నానాటికి తగ్గిపోతుంది.

రూ.7.83 కోట్లు పెండింగ్

ఇప్పుడు వ్యవసాయ పనుల సీజన్ అయినా కూలీలకు ఉపాధి లభించని పరిస్థితి నెలకొంది. దాంతో అనేకమంది కార్మికులను ఉపాధి పనులే ప్రధానంగా ఆదుకుంటున్నాయి. ఈ తరుణంలో పని చేసిన ఒకటి, రెండు వారాల్లో కూలీల ఖాతాల్లో డబ్బులు జమ చేసేవారు. సుమారు 8 వారాల నుంచి నేటి వరకు చేసిన పనులకు వేతనాలు మంజూరు కాలేదు.రోజుకి సరాసరి 14 వేల మంది పని చేస్తుండగా ఒక్కొక్కరికి 48 రోజులకు వేతనం అందాల్సి ఉంది.మొత్తంగా సుమారు రూ.7.83 కోట్లు వేతనాలు పెండింగులో ఉన్నాయి.

అప్పులతోనే కుటుంబ పోషణ



వ్యవసాయ పనులు సక్రమంగా లేవు. కుటుంబాలను పోషించుకునేందుకు ఉపాధి పనులకు వెళుతుంటే రెండు నెలలుగా వేతనాలు ఇవ్వడం లేదు. అప్పులు చేయాల్సి వస్తుంది. ప్రభుత్వం వెంటనే స్పందించి తక్షణమే ఖాతాల్లో వేతనాలు వేయాలి.

- కట్టా బాబ్జి, ఉపాధి కూలి, గండేపల్లి

వెంటనే వేతనాలు విడుదల చేయాలి



అరకొర వేతనాలతో బతుకుతున్న వ్యవసాయ కార్మికులకు ఉపాధి హామీలో పెండింగ్ కూలి సొమ్ములను ప్రభుత్వం వెంటనే విడుదల చేయాలి. పెరుగుతున్న నిత్యావసరాల ధరలను దృష్టిలో ఉంచుకొని పని దినాల సంఖ్యను పెంచి, రూ.60 కు కూలీ రేట్లు పెంచాలి.

- కెఎస్.శ్రీనివాస్, ఎపి వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి

కార్మిక హక్కుల పరిరక్షణకు పోరాడాలి

ప్రజాశక్తి - సామర్లకోట

కార్మికుల హక్కుల పరిరక్షణకు కార్మికులందరూ ఐక్యంగా పోరాడాలని సిఐటియు జిల్లా అధ్యక్షులు దువ్వా శేషబాబ్జి పిలుపునిచ్చారు. ఆదివారం బేవరేజ్ హమాలిస్ వర్కర్స్ యూనియన్ 6వ మహాసభ స్థానిక డిపోలో అధ్యక్షులు నాళం సత్యనారాయణ అధ్యక్షతన నిర్వహించారు. సభకు ముఖ్య అతిథిగా విచ్చేసిన సిఐటియు జిల్లా అధ్యక్షులు దువ్వా శేషబాబ్జి మాట్లాడుతూ కార్మికుల పై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అవలంభిస్తున్న కార్మిక చట్టాల నిర్వీర్యం చేయడం వల్ల కార్మికులు వారి హక్కులను పూర్తిగా కోల్పోయే పరిస్థితులు ఏర్పడుతున్నాయన్నారు. కార్మిక వ్యతిరేక చట్టాల వల్ల 8 గంటల పని విధానం పోయి 12 గంటల పని విధానాన్ని కేంద్ర ప్రభుత్వం చూస్తోందని దీనివల్ల కార్మికులు తీవ్రంగా నష్టపోతారని అన్నారు. హక్కుల పరిరక్షణకు ఉద్యమించే నాయకుల పైన అక్రమ కేసులు బనాయించి ఉద్యమాలు అణచివేయాలని ప్రభుత్వాలు చూడటం దారుణమన్నారు అటువంటి చర్యలను తిపికొట్టేందుకు కార్మికులందరూ ఐక్యంగా ఉద్యమించాలని పిలుపునిచ్చారు. సిఐటియు జిల్లా కార్యదర్శి బాలం శ్రీనివాస్, సిఐటియు మండల కార్యదర్శి సురేష్ కుమార్ మాట్లాడుతూ 28 ఏళ్లుగా బేవరేజ్ డిపోలో ఎగుమతి, దిగుమతి పనులు నిర్వహిస్తూ ప్రభుత్వానికి వేలకోట్ల రూపాయలు ఆదాయం చేకూర్చిన హమాలీలకు పి.ఎఫ్, ఇ.ఎస్.ఐ కల్పించి ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని, ఎగుమతి కూలి రేట్లు సాధించేవరకు ఐక్యతగా పోరాడాలని పిలుపు నిచ్చారు. అనంతరం రెండు సంవత్సరాలు సంఘం చేసిన పోరాటాలు సాధించిన విజయాలు సమీక్షపై కార్యదర్శి నివేదికను ప్రవేశపెట్టిన బేవరేజ్ హమాలీస్ రాష్ట్ర కార్యదర్శి విప్పర్తి కొండలరావు ప్రవేశపెట్టారు. అనంతరం నూతన కార్యవర్గ ఎన్నిక జరిగింది. కార్యక్రమంలో సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు కరణం ప్రసాదరావు ఎన్.వీరఅప్పారావు, వి.గోవిందు, సోమేస్, బి. రామా రావు, పి. సత్తిబాబు, హమాలీ సభ్యులు పాల్గొన్నారు.



మహాసభను ఉద్దేశించి మాట్లాడుతున్న సిఐటియు జిల్లా కార్యదర్శి దువ్వ శేషబాబ్జి

నూతన కార్యవర్గం

బేవరేజెస్ హమాలీ వర్కర్స్ యూనియన్ గౌరవ అధ్యక్షులుగా బాలం శ్రీనివాస్, అధ్యక్షులుగా నాళం సత్యనారాయణ, కార్యదర్శిగా వి.అప్పలరాజు, ఉపాధ్యక్షులుగా బి.ఆది నారాయణ, సహాయ కార్యదర్శిగా అమలకంటి సోమేశ్, కోశాధికారిగా నాళం తిరుమలరావుతో పాటు ఆరుగురు సభ్యులతో కమిటీని ఎన్నుకున్నారు.





నూతన అధ్యక్ష, కార్యదర్శులు నాళం సత్యనారాయణ, కార్యదర్శి వి అప్పలరాజు

వైసిపి దాడులను ప్రజలు గమనిస్తున్నారు

- టీడీపి రాష్ట్ర ఉపాధ్యక్షులు జ్యోతుల నెహ్రూ

ప్రజాశక్తి - కాకినాడ కార్పొరేషన్

మాచర్ల పట్టణంలో మెయిన్ బజార్లో "ఇదేం ఖర్మ మన రాష్ట్రానికి "కార్యక్రమం నిర్వహిస్తున్న టిడిపి శ్రేణులపై వైసిపి గుండాల దాడులను టీడీపి రాష్ట్ర ఉపాధ్యక్షులు జ్యోతుల నెహ్రూ ఆదివారం విలేకరుల సమావేశంలో తీవ్రంగా ఖండించారు.

మాచర్ల పట్టణం మెయిన్ బజార్లో, మాచర్ల నియోజకవర్గం టిడిపి ఇన్‌చార్జ్ జూలకంటి బ్రహ్మారెడ్డి ఆధ్వర్యంలో" ఇదేం ఖర్మ మన రాష్ట్రానికి కార్యక్రమంలో భాగంగా కరపత్రాలను పంపిణీ చేస్తుంటే వైసీపీ రౌడీ మూకలు, గుండాలు 100 మందిపైగా కర్రలతో రెండు చోట్ల గుమిగూడారని పోలీసులకు సమాచారం ఇచ్చినప్పటికీ పోలీసులు పట్టించుకోకపోవడం దారుణమని అన్నారు. ఏపీ లో స్టేట్ స్పాన్సర్డ్ టెర్రరిజం కొనసాగుతుందనదనికి మాచర్లలో జరిగిన ఘటన నిదర్శనమన్నారు. టిడిపి కార్యాలయం టిడిపి కార్యకర్తల ఇళ్లను, కార్లను, బైక్ లను ధ్వంసంచేసి వైసీపీ గుండాలు తగలబెడుతుంటే పోలీసులు చోద్యం చూస్తున్నరని, టిడిపికి చెందిన బీసీ, ఎస్‌సి, ఎస్‌టి నాయకుల ఇళ్ళే లక్ష్యంగా వైసిపి గుండాలు దాడులకు తెగబడ్డారన్నారు. టిడిపి ఇన్చార్జ్ బ్రహ్మారెడ్డిని మాచర్ల నుంచి వేరే ప్రాంతానికి తరలించి టిడిపి కార్యకర్తలని పోలీసులు చెల్లా చెదురు చేసిన తర్వాత పిన్నెల్లి రామకష్ణారెడ్డి రౌడీ మూకలు గంటల తరబడి దహనాలు, విధ్వంసాలు, లూటీలు చేస్తుంటే పోలీసులు ఏం చేస్తున్నారు? ఇది పోలీసులు, వైకాపా కలిసి చేసిన కుట్ర కాదా? తాడేపల్లి ప్యాలెస్ డైరెక్షన్లో ఇంటలిజెన్స్ చీఫ్ సీతా రామాంజనేయులు, ఎస్‌పి రవిశంకర్ రెడ్డి పర్యవేక్షణలోనే మాచర్ల విధ్వంసకాండ జరిగిందని ఆరోపించారు. రాష్ట్రంలో వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత తెలుగుదేశం పార్టీ నాయకులు కార్యకర్తలపై వైసీపీ మూకల మారణకాండ కొనసాగుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రజల ఆస్తులతో పాటు మానప్రాణాలకు వైసీపీ ప్రభుత్వంలో రక్షణ లేకుండా పోయిందన్నారు.



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న జ్యోతుల నెహ్రూ

మురారి జాతర బందోబస్తు పరిశీలన

ప్రజాశక్తి - గండేపల్లి

గండేపల్లి మండలం మురారి గ్రామ శివారు దుర్గమ్మ జాతర రెండో ఆదివారం నిర్వహించారు. అధిక సంఖ్యలో వచ్చే ప్రజలకు పెద్దాపురం డి.ఎస్.పి సుంకర మురళీమోహన్ ఆదేశాల మేరకు జగ్గంపేట సిఐ బి.సూర్య అప్పారావు, గండేపల్లి ఎస్ఐ గణేష్ కుమార్ బందోబస్తు ఏర్పాట్లు చేశారు. ఆదివారం మధ్యాహ్నం ఆలయానికి కాకినాడ అడిషనల్ ఎస్పి అడ్మిన్ పి. శ్రీనివాస్ వచ్చి.. దర్శనం చేసు కుని, గుడి వద్ద బందొబస్తూ ఏర్పాట్లును పరిశీలించారు. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా జాగ్రత్తలు తీసుకోవాల న్నారు. ఆయన వెంట డి.ఎస్.పి సుంకర మురళీమోహన్ ఉన్నారు.



భూ హక్కు పత్రాలు పంపిణీ చేస్తున్న దొరబాబు

భూ హక్కు పత్రాల పంపిణీ

ప్రజాశక్తి - పెద్దాపురం

వైయస్సార్ జగనన్న శాశ్వత భూ హక్కు రీ సర్వే పత్రాలను రాష్ట్ర హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ దవులూరి దొరబాబు ఆదివారం రైతులకు పంపిణీ చేశారు. పెద్దాపురం మండలం సిరివాడలోని రైతు భరోసా కేంద్రంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో సభలో పత్రాల పంపిణీ అనంతరం దొరబాబు మాట్లాడుతూ డ్రోన్లు, రోవర్సు వంటి అత్యాధునిక సాంకేతికను ఉపయోగించి ఈ సమగ్ర రీసర్వేని దేశంలోనే మొట్టమొదటగా ప్రారంభించిన రాష్ట్రం ఆంధ్రప్రదేశ్ అన్నారు. గ్రామస్థాయిలో భూ రికార్డులన్నీ కోడికరించి భూ కమతాలతో కూడిన మ్యాపులు రూపొందించారన్నారు. 2023 డిసెంబర్ నాటికి ఈ ప్రాజెక్టును పూర్తి చేయడానికి రాష్ట్ర ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. కార్యక్రమంలో ఆర్‌డిఒ జె.సీతారామారావు, జడ్‌పిటిసి గవరసాన సూరి బాబు, ఎంపిపియ పెంకే సత్యవతి, వైస్ ఎంపిపి మిరియాల రాజా, ఎంపిడిఒ హిమ మహేశ్వరి, వైసిపి నాయకులు పాల్గొన్నారు.



కాకినాడ పోర్టు భూమి

పోర్ట్ భూముల్ని తాకట్టు పెట్టే హక్కు
మారీటైమ్ బోర్డుకు లేదు

ప్రజల ఆస్తిని, ప్రభుత్వ రంగాన్ని నాశనం చేయొద్దు : సిఐటియు

ప్రజాశక్తి - కాకినాడ

కాకినాడ పోర్టు భూములు ప్రజలు, కార్మికులు ఉమ్మడి సొత్తు. వీటిని ప్రభుత్వం కాపాడ వలసిందిపోయి, పోర్ట్ భూముల్ని తాకట్టు పెట్టడం అంటే అత్త సొమ్ము అల్లుడు ధారపోసినట్లు ఉందని, మారీటైమ్ బోర్డుకు పోర్ట్ ఆస్తుల్ని తాకట్టు పెట్టే హక్కు లేదని సిఐటియు పోర్ట్ యూనియన్ నాయ కులు చింతపల్లి అజయ్ కుమార్ స్పష్టం చేశారు. 2004-05 సంవత్సరాల్లో నాటి ప్రభుత్వం యాంకరేజ్ పోర్ట్‌ను మారీటైమ్ బోర్డుగా మార్చే ప్రతిపాద నలు వచ్చినప్పుడు సిఐటియు, ఆల్ ట్రేడ్ యూనియన్ సంఘాలు అనేక పోరాటాలు నిర్వహించాయన్నారు. ప్రభుత్వ రంగంలో ఉన్న పోర్ట్‌ను ప్రయివేటీకరణ చేయరాదని, ఉద్యోగుల హక్కులు కాపాడాలని, 45 రోజులు పెద్ద ఎత్తున పోరాటాలు జరిగాయి. కాలక్రమంలో రాష్ట్ర ప్రభుత్వం అసెంబ్లీలో మారీటైమ్ బోర్డుగా తీర్మానం చేయడం కార్మికులకు శాపంగా మారింది. ఈ ప్రమాదాలను సిఐటియు ఆనాడే హెచ్చరించిందని అజయ్ ఈ సందర్భంగా గుర్తుచేశారు. యాంకరేజ్ పోర్టులో వెయ్యిమంది పైన ఉన్న ఉద్యోగులు నేడు యాభై మందికి తగ్గిపోయారన్నారు. పోర్టులో ఉన్న బుల్‌డోజర్ ఇతర యంత్రాల రిపేర్లకు చొరవ చూపని బోర్డు యాజమాన్యం పోర్టు అధికారులు ఏ విధంగా పోర్ట్ భూముల్ని తాకట్టు పెడతా రని అజయ్ కుమార్ సూటిగా ప్రశ్నించారు. ఎస్‌బీఐకు పోర్ట్ భూముల్ని 1,500 కోట్ల రూపాయలకు తాకట్టు పెట్టడాన్ని పోర్టు కార్మికులు, సంఘాలు, ప్రజలందరూ దీనిని ఖండించాలని సిఐటియు పిలుపు నిస్తోందన్నారు. కార్మికుల మనోభావా లను పరిగణలోనికి తీసుకోకుండా తప్పుడు పద్దతుల్లో, సంతకాలతో రిజిస్ట్రేషన్ చేయడాన్ని వ్యతిరేకించాలని, అవసరమైతే రాష్ట్ర అసెంబ్లీలో కూడా ఈ విషయం చర్చకు తీసుకు రావాలని అజయ్ డిమాండ్ చేశారు.



పోర్టులో మరమ్మతులకు వచ్చిన రోడ్ రోలర్



విద్యార్థులకు స్టోరీ టైంలో కథలు వినిపిస్తున్న లైబ్రేరియన్ శ్రీనివాసరావు

పుస్తక పఠనంతో విజ్ఞానం

ప్రజాశక్తి - కాకినాడ కార్పొరేషన్

తూర్పుగోదావరి జిల్లా గ్రంథాలయ సంస్థ ఆధ్వర్యంలోని కాకినాడ గాంధీనగర్ శాఖ గ్రంథాల యంలో ఆదివారం పాఠశాల విద్యార్థులతో చదవడం మాకిష్టం -సండే స్టోరీ టైం కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి హాజరైన అడ్వకేట్ స్వాతి మాట్లాడుతూ విద్యార్థి దశ నుంచే పుస్తక పఠనం అలవాటు చేసుకోవడం వలన విద్యార్థులు విజ్ఞాన వంతులు కావచ్చు అని తెలిపారు. కార్యక్రమంలో విద్యార్థులు జాఫర్, ఉస్మాన్ లు అమాయక ఒంటె, విక్రమ్ బేతాల్, పంచతంత్రం తదితర కథలను చదివి వినిపించారు.

ఈ సందర్భంగా లైబ్రేరియన్ ములంపాక శ్రీనివాస రావు ప్రతి ఆదివారం కాకినాడ శాఖ గ్రంథాల యంలో నిర్వహించే చదవడం మాకిష్టం సండే స్టోరీ టైం కార్యక్రమం గురించి విద్యార్థులకు వివరించి వారు ప్రతి ఆదివారం గ్రంథాలయానికి తప్పక హాజరు కావాలని కోరారు.




బాధిత కుటుంబాన్ని పరామర్శిస్తున్న కృష్ణస్వరూప్

క్వారీ ప్రమాద బాధ్యులపై చర్యలకు డిమాండ్

ప్రజాశక్తి -రౌతులపూడి

మండలంలోని ఎస్ పైడిపాలలో గిరిజన దంపతులు మరణానికి కారణమైన ఎస్ పైడిపాల గ్రామ శివారు క్వారీ బ్లాస్టింగ్ చేసిన వారిపై, బ్లాస్టింగ్ మెటీరియల్ కాంట్రాక్టర్ పైన చర్యలు తీసుకోవాలని దళిత బహుజన పార్టీ జాతీయ అధ్యక్షులు, సుప్రీంకోర్టు న్యాయవాది వడ్లమూరి కృష్ణస్వరూప్ డిమాండ్ చేశారు. రౌతులపూడిలో ఆదివారం విలేకరులతో సమావేశం నిర్వహించిన ఆయన బాధిత కుటుంబానికి కోటి రూపాయలు నష్ట పరిహారం చెల్లించాలని రాష్ట్ర ప్రభుత్వాని, కాకినాడ జిల్లా యంత్రాంగాన్ని డిమాండ్ చేశారు. 15 సంవత్సరాల క్రితం మూసివేసిన క్వారీకి ఎటువంటి అనుమతులు లేకుండా పేలుడు పదార్థాలతో బ్లాస్టింగ్ చట్ట వ్యతిరేకంగా చేయడం వలనే గిరిజనులు ప్రాణాలు కోల్పోయారని ఆరోపించారు ఈ బ్లాస్టింగ్ అధికార పార్టీకి చెందిన కాంట్రాక్టర్లు గ్రామపంచాయతీ సర్పంచ్ భర్త, ఎంపీటీసీ భర్త రాయి ప్రసాద్, మరో 10 మంది బాధ్యులన్నాఉ. పేలుడు పదార్థాల విక్రయం చేసిన వ్యాపారస్తులు మీద వీరిపై కేసులు నమోదు చేసి చట్ట పరమైన చర్యలు తీసుకోవాలని పోలీస్. మైనింగ్, రెవెన్యూ అధికారులను డిమాండ్ చేశారు. జిల్లా కలెక్టర్, జిల్లా ఎస్పీ బాధిత కుటుంబాన్ని పరామర్శించాలని కోరారు. అక్రమంగా బ్లాస్టింగ్ నిర్వహిస్తున్న వారిపై క్రిమినల్ చర్యలు తీసుకోకపోతే అధికార యంత్రాంగం పైన హైకోర్టు, సుప్రీంకోర్టులో పోరాడుతామని కృష్ణ స్వరూప్ హెచ్చరించారు. మతులకు కలిగిన పిల్లలను దాతలు మానవత దృక్పథంతో ఆదుకోవాలని పిలుపు నిచ్చారు. కృష్ణస్వరూప్ కొంత నగదును బాధిత కుటుంబానికి అందజేశారు. ఆయన వెంట మాల మహానాడు కాకినాడ జిల్లా కోఆర్డినేటర్ చిటమూరి గోవిందు, తుని నియోజవర్గ ఇన్‌ఛార్జ్ మారుతి సింహాచలం, కె.కళ్యాణ్ తదితరులు ఉన్నారు.

కార్టూ'నిజం'



వాళ్లకి రూ.లక్షల కోట్లు రుణమాఫీ చేయడం వల్ల మీకు వడ్డీరేట్లు పెంచక తప్పడం లేదయ్యా!!!

ఉత్సాహంగా టెక్నో క్రిస్మస్ వేడుకలు



జెఎన్‌టియుకెలో క్రిస్మస్ కేకును కట్ చేస్తున్న విసి ప్రసాద్ రాజు ....



పెద్దాపురంలో క్రిస్మస్ వేడుకల్లో సందేశం ఇస్తున్న కమిటీ సభ్యుడు

ప్రజాశక్తి - కాకినాడ

జెఎన్‌టియుకె అలూమ్ని ఆడిటోరియంలో టి.జి.ఏ ప్రెసిడెంట్ వార వినోద్ అధ్యక్షతన టెక్నో క్రిస్మస్ వేడుకలు నిర్వహించారు. ఈ కార్యక్రమాని సింహాద్రి ప్రార్ధనతో ప్రారంభించగా వహించారు. కార్యక్రమానికి జెఎన్‌టియుకె విసి డాక్టర్ ప్రసాద్ రాజు ముఖ్య అతిథిగా క్రిస్మస్ కేక్ ను కట్ చేసి విద్యార్థులుకు శుభాకాంక్షలు తెలియజేశారు. సి.వై.ఫ్. ఇంటర్నేషనల్ డైరెక్టర్ మూర్తి రాజు క్రిస్మస్ సందేశాన్ని అందిం చారు. టి.జి.ఏ సెక్రటరీ సందీప్, టి.జి.ఏ వైస్-ప్రెసిడెంట్ సుభాష్, డాక్టర్ వంశి కష్ణ రాజా, విల్సన్, మేరీ జ్యోతి సత్య నారాయణ,. జోసెఫ్, సిస్టర్ గ్లోరి, మహిమ ప్రభాకర్ క్రిస్మస్ గ్రీటింగ్స్ తెలియజేశారు. కార్యక్రమంలో గగారిన్, మచ్చ బుజ్జి, ట్రస్ట్ శ్రీనివాస్ సమయానికే వచ్చిన విద్యార్థులకు డ్రా తీసి బహుమతులు అందజేశారు. కన్నా ఆధ్వర్యంలో కూసి సుధాకర్ క్రిస్మస్ గీతాలని ఆలపించారు. కార్యక్రమంలో బాలు, పూర్ణ, రామ కష్ణ, మనోహర్, అజిత్, నాని, జోష్ బాబు సుమారు 20 కళాశాలలనుండి వెయ్యి మంది విద్యార్థులు పాల్గొన్నారు. **పెద్దాపురం** మున్సిపల్ సెంటర్లోని అంబేద్కర్ భవనంలో నియోజకవర్గ రీజియన్ చైర్మన్ డాక్టర్ లంక పురుషోత్తమ దాసు ఆధ్వర్యంలో మండల స్థాయి క్రిస్మస్ వేడుకలు ఘనంగా నిర్వహించారు. రీజనల్ కార్యదర్శి డి.వెంకట్‌పాల్ ఈ వేడుకలకు ఆహ్వానం పలికి, క్యాండిల్ సర్వీస్, కేక్ కటింగ్ చేశారు. అతిథులందరిని రీజియన్ కమిటీ ఆధ్వర్యంలో పూలమాలలు, శాలువాలతో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో జిల్లా గౌరవ అధ్యక్షులు జోసెఫ్ బెన్ని, జనరల్ సెక్రెటరీ డాక్టర్ సీరం ఐజక్, ఎగ్జిక్యూటివ్ సెక్రటరీ డాక్టర్ విక్టర్ శామ్యూల్,ఉప కోశాధికారి ఎం.విజయ్ కుమార్ ,వైస్ ప్రెసిడెంట్ డాక్టర్ టి. బ్లెస్సింగు,స్వర్ణ దేవాలయం జాయింట్ సెక్రెటరీ డాక్టర్ జిఆర్ ఇమ్మానియేల్ రాజ్, జాన్ మోజెస్, డాక్టర్ సి.బి.ఐ సుకుమార్, సిహెచ్ జ్యోతి బాబు, ఎన్ కేఫా, డాక్టర్ పరిమి ఐజాక్, జి.ఆనంద్ సామ్యూల్, డాక్టర్ డిపిడి కె.జార్జి మేషన్, డాక్టర్ వైఆర్ మన్నా, జె జయబాబు, సత్యానందం తదితరులు పాల్గొన్నారు.



సిఐటియు యు.కొత్తపల్లి మండల నూతన కార్యవర్గం

సిఐటియు మండల నూతన కమిటీ ఎన్నిక

ప్రజాశక్తి-యు. కొత్తపల్లి

సానా సుబ్రహ్మణ్యం ప్రాంగణంలో భవన నిర్మాణ, అదర్ కన్స్ట్రక్షన్ వర్కర్స్ ఫెడరేషన్ మహాసభ ఆదివారం నిర్వహించారు. ఈ సభకు కె.వి.వి.సత్య నారాయణ సీఐటీయూ మండల కార్యదర్శి అధ్యక్షత వహించగా జిల్లా సీఐ టీయూ కార్యదర్శి సిహెచ్. రాజ్‌కుమార్ విశిష్ట అతిథిగా వ్యవహరించారు. మొదటగా ఈ మధ్య కాలంలో మరణించిన ప్రజాతంత్ర నాయకులకు సంతాప తీర్మానాన్ని కె.వి.వి.సత్యనారాయణ ప్రవేశపెట్టిన అనంతరం సిహెచ్. సాంబ శివకుమార్ కార్యదర్శి నివేదికను ప్రవేశపెట్టారు. సంక్షేమ బోర్డును పునరుద్ధరించాలని, సిమెంట్, స్టీల్, రంగులు మొదలగు వాటిపై ధరలు తగ్గించాలని భవన నిర్మాణ కార్మికులకు సంక్షేమ చట్టం తేవాలని తీర్మానాలను మహాసభ అమోదించింది. అనంతరం నూతన కమిటీను ఎన్నుకున్నారు. సిహెచ్.శ్రీను అధ్యక్షులుగా సిహెచ్.సాంబశివకుమార్ కార్యదర్శిగా మొత్తం 15మందితో నూతన కమిటీని ఎన్నుకున్నారు కె.వి.వి.సత్య నారాయ ణను గౌరవ అధ్యక్షులుగా ఎన్నుకున్నారు. కార్యక్రమంలో జి.అప్పా రెడ్డి, కె.నాగేశ్వరరావు, కుంచె చిన్నా, కె.విశ్వనాథం, సిహెచ్. నారాయణరెడ్డి, ఏ. వాసు పాల్గొన్నారు.

రైతులు ఆందోళన చెందొద్దు

ప్రజాశక్తి - కాజులూరు

ధాన్యం అమ్మకాల్లో రైతులు ఆందోళన చెందవద్దని ఎఒ అశోక్ తెలిపారు. ఆదివారం మండలంలోని కోలంక, ఆర్యవటం జగన్నాధగిరి గ్రామాల్లో ధాన్యం కొనుగోలును మండల వ్యవ సాయ అధికారి అశోక్ పరిశీలించారు. ఆర్యవటంలో ఎ.ఒ అశోక్ మాట్లాడుతూ రెండు రోజులుగా బ్యాంకు గ్యారంటీలు లేకపోవడంతో ఎగుమతి చేసిన ధాన్యం ఎక్కడక్కడ నిలిచిపోయాయని అయితే ఉన్నతాధికారుల ఆదేశాలపై మండలంలోని ధాన్యాన్ని పిఠాపురం గొల్లప్రోలు మిల్లులు కూడా అనుమతి ఇవ్వడంతో ఈరోజు 20 ట్రక్కర్ల ధాన్యాన్ని పంపించినట్లు తెలిపారు. మండలంలోని కోలంక రైసిమిల్లు కూడా అనుమతులు రావడంతో సోమ, మంగళవారంలో ధాన్యాన్ని పంపించనున్నట్లు తెలిపారు. ధాన్యం అమ్మకాలపై రైతులు ఎవరు ఆందోళన చెందవద్దని ఆయన ధైర్యం చెప్పారు. కార్యక్రమంలో వ్యవసాయ సహాయకులు రాజేష్, శివ, శిరీష పలువురు రైతులు పాల్గొన్నారు.

శాస్త్రవేత్తల సూచనలు పాటించాలి

ప్రజాశక్తి - పెద్దాపురం

వ్యవసాయ విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలో వ్యవసాయ శాస్త్రవేత్తలు సిఫార్సు చేసిన వరి వంగడాలనే రైతులు వినియోగించాలని వ్యవసాయ పరిశోధన స్థానం అధిపతి డాక్టర్ పి మురళీకృష్ణ అన్నారు. స్థానిక వ్యవసాయ పరిశోధన కేంద్రంలో రబీ వ్యవసాయానికి సంబంధించి నిర్వహించిన శిక్షణ - సందర్శన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. వ్యవసాయ శాస్త్రవేత్తలు సూచించిన వంగడాలను వినియోగించడం వల్ల ఆయా ప్రాంతాల వాతావరణ పరిస్థితులకు అనుగుణంగా తెగుళ్లను తట్టుకుని అధిక దిగుబడులు సాధించే అవకాశం ఉందన్నారు. దీనికి సంబంధించి ప్రాంతాలవారీగా రైతుల్లో అవగాహన పెంచాలన్నారు. నారుమళ్లు, నాట్లు, నేరుగా విత్తనాలు చల్లడం వంటి వాటిపై రైతుల్లో ఆధునిక వ్యవసాయ పద్ధతులపై అవగాహన పెంచాలన్నారు. కార్యక్రమంలో వ్యవసాయాధికారులు ప్రాంతాల వారీగా వ్యవసాయ ప్రగతిని వివరించారు. కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ శాఖ అధికారి డాక్టర్ ఎన్ విజయ్ కుమార్, డాక్టర్ మాధవరావు, ఆత్మ ఏడి నాగేశ్వర రావు, ఏరువాక కేంద్రం కో-ఆర్డినేటర్ సిహెచ్‌వి నరసింహారావు, వ్యవసాయ శాస్త్రవేత్తలు ఏఎస్ఆర్ శర్మ, ఎస్ బాలాజీనాయక్, వి.సుజాత పాల్గొన్నారు.

లోకేష్ దృష్టికి నియోజకవర్గ సమస్యలు


లోకేష్‌ను కలిసిన సుభాష్ చంద్రబోస్

ప్రజాశక్తి - ఏలేశ్వరం

: ప్రత్తిపాడు నియోజకవర్గంలో నెలకొన్న సమస్యలను టిడిపి జాతీయ కార్యదర్శి నారా లోకేష్‌కు వివరించినట్లు ఆ పార్టీ కాకినాడ పార్లమెంటరీ అధికార ప్రతినిధి పైల సుభాష్ చంద్రబోస్ తెలిపారు. ఈ మేరకు ఆదివారం లోకేష్ ను కలిసిన బోస్ పలు పార్టీ విషయాలపై చర్చించినట్లు తెలిపారు. నియోజకవర్గంలోనే ఏకైక మున్సిపాలిటీ, 23,000 ఓటింగ్ కలిగిన ఏలేశ్వరా నికి ప్రత్తిపాడు సీటును కేటాయించాలని కోరగా పరిశీలిస్తామని హామీ ఇచ్చారన్నారు.

కాకినాడలో చెట్లు నరికివేత

నలుగురిపై కేసు నమోదు

ప్రజాశక్తి - కాకినాడ కార్పొరేషన్

కాకినాడ మెయిన్‌రోడ్డులోని కొన్ని వాణిజ్య సముదాయాల వద్ద అనుమతి లేకుండా చెట్లు కొమ్మలు, కొంత భాగాన్ని నరికివేసిన వ్యవహారంపై కేసు నమోదైంది. శనివారం రాత్రి 11 గంటల సమయంలో వీటిని తొలగిస్తున్నట్లు వచ్చిన ఫిర్యాదుతో కార్పొరేషన్ కమిషనర్ కే రమేష్, ఏడిసి సిహెచ్ నాగ నరసింహారావు ఆదేశాల మేరకు ఉద్యాన సహాయ సంచాలకులు టీవీ సిరిల్ ఆధ్వర్యంలో సిబ్బంది అక్కడకు చేరుకున్నారు. దీంతో చెట్లను నరికివేస్తున్న వ్యక్తులు పరారయ్యారు. ఈ వ్యవహారంపై ఫారెస్ట్ కన్జర్వేషన్ యాక్టు 1980, ఫారెస్ట్ యాక్టు 1967 29/2బి, వాల్టా చట్టం ప్రకారం టూటౌన్ పోలీస్‌స్టేషన్‌కు ఫిర్యాదు చేసినట్లు హార్టికల్చర్ ఏడీ సిరిల్ చెప్పారు. అదనపు కమిషనర్ నాగ నర్సింహారావు, ఎస్ఈ సత్యకుమారి ప్రత్యేక పర్యవేక్షణలో ఇలాంటి చర్యలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకుంటామని అన్నారు. నగరపాలక సంస్థ అనుమతి లేకుండా చెట్లు, వాటి కొమ్మలు తొలగిస్తే చట్టరీత్యా శిక్షార్హులని ఆయన తెలిపారు


జె తిమ్మాపురంలో సంక్షేమ పథకాలు వివరిస్తున్న దొరబాబు

కె.తిమ్మాపురంలో గడప గడపకూ..

ప్రజాశక్తి - పెద్దాపురం

పెద్దాపురం మండలం జె.తిమ్మాపురంలో రాష్ట్ర హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ దవులూరి దొరబాబు ఆధ్వర్యంలో ఆదివారం గడపగడపకు మన ప్రభుత్వం నిర్వహించారు. వైసిపి నాయకులతో కలసి ఆయన గ్రామంలో ఇంటింటికి తిరుగుతూ జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వ హయాంలో ప్రతి గ్రామంలో నాడు - నేడు పథకం ద్వారా ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధిని, విద్యాభివృద్ధికి చేస్తున్న కృషిని, విద్యార్థులకు అందజేస్తున్న చేయూతను వివరించారు. కార్యక్రమంలో జడ్పిటిసి గవరసాన సూరిబాబు, వైస్ ఎంపీపీ మిరియాల రాజా, వైసీపీ నాయకులు, కార్యకర్తలు,పంచాయితీ,సచివాలయం సిబ్బంది పాల్గొన్నారు.


ఆర్థిక సహాయం చేస్తున్న మాజీ ఎమ్మెల్యే వర్మ

బాధిత కుటుంబానికి వర్మ సాయం

ప్రజాశక్తి -యు.కొత్తపల్లి

కొత్తపల్లి ముత్యాలమ్మ గుడి ప్రాంతానికి చెందిన వ్యక్తికి ఇటీవల రోడ్డు ప్రమాదంలో గాయపడ్డారు. విషయం తెలుసుకున్న మాజీ ఎంఎల్ఎ వర్మ కుటుంబాన్ని పరామర్శించి, ఆర్థిక సాయం అందించి, భరోసాఇచ్చారు. కార్యక్రమంలో టిడిపి పార్లమెంట్ అధికార ప్రతినిధి రావు మాధవరావు, బీసీ సెల్ అధ్యక్షులు గింజల శ్రీను, బత్తిన శ్రీను తదితరులు పాల్గొన్నారు.



హ్యాండ్ బాల్ క్రీడాకారులతో హెచ్ఎం. కరుణ, పీడీ చంద్రావతి

రాష్ట్ర స్థాయి హ్యాండ్ బాల్ పోటీలకు ఇంజరం విద్యార్థులు

ప్రజాశక్తి - తాళ్లరేవు

రాష్ట్రస్థాయి హ్యాండ్ వాల్ పోటీలకు ఇంజరం హైస్కూల్ నుంచి ఐదుగురు విద్యార్థులు ఎంపికైనట్లు హెచ్ఎం. కరుణ తెలిపారు. అండర్ 14 బాలికల విభాగంలో వాసంశెట్టి మనోహరిని, సాగి హాస్య, ఇసుక పట్ల రూపశ్రీ ఎంపిక య్యారు. అండర్ 17 బాలుర విభాగంలో గుమ్మల నాగ వీర వెంకట సత్య నారాయణ, మాసగిరి సునీల్ కుమార్ ఎంపికయ్యారని తెలిపారు. త్వరలో పుట్టపర్తిలో జరగబోయే అండర్-14 రాష్ట్రస్థాయి బాలికల పోటీలోనూ, ప్రకాశం జిల్లాలో జరగబోయే అండర్ -17 బాలుర పోటీల్లోనూ ఈ విద్యార్థులు పాల్గొంటారని తెలిపారు. విద్యార్థులతో పాటు పీడీ లంకె చంద్రావతి పాల్గొన్నారు.

పారదర్శకంగా ధాన్యం కొనుగోళ్లు

'ప్రజాశక్తి'తో జాయింట్ కలెక్టర్ ఇలాక్కియ





ప్రజాశక్తి–కాకినాడ ప్రతినిధి

రైతులు పండించిన ధాన్యాన్ని పారదర్శకంగా కొనుగోలు చేస్తామని జిల్లా జాయింట్ కలెక్టర్ ఎస్.ఇలక్కియ వెల్లడించారు. ధాన్యం కొనుగోలులో ఎలాంటి అక్రమాలు జరిగినా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. దళారులను ఆశ్రయించకుండా ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లోనే రైతులు ధాన్యాన్ని అమ్ముకోవాలన్నారు. ప్రజాశక్తికిచ్చిన ఇంటర్వ్యూలో ఆమె ఇంకా పలు అంశాలు వెల్లడించారు.

◆ **ధాన్యం సేకరణ లక్ష్యం ఎంత..?**

కాకినాడ జిల్లాలో ఈ ఏడాది 2.55 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేయాలని లక్ష్యంగా నిర్ణయించాం. 266 ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేశాం. కోసిన ధాన్యం కొంత పచ్చిగా ఉంటుంది. తేమ శాతం 17 కంటే ఎక్కువ ఉండకూడదు.

◆ **ఇప్పటి వరకూ ఎంత ధాన్యాన్ని కొనుగోలు చేశారు..?**

ఇప్పటి వరకు జిల్లాలో పలు ఆర్బికేల్లో 30,452 మంది రైతుల నుంచి 1,48,123 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని సేకరించాం. వారికి రూ.303.64 కోట్ల సొమ్ము ఇవ్వాల్సి ఉంది. ఇప్పటి వరకు రూ.64.35 కోట్లు రైతుల ఖాతాల్లో జమ అయ్యాయి. మిగిలిన సొమ్ము కూడా నిబంధనల ప్రకారం అనుకున్న సమయానికే జమ చేయడం జరుగుతుంది. సరిపడా గోనె సంచులు మిల్లర్ల వద్ద అందుబాటులో ఉన్నాయి. అవసరమైన కాటాలు, తేమ యంత్రాలు ఉన్నాయి. కళ్లాల్లోనే కాటా వేస్తారు.

◆ **ఫిర్యాదులు ఎలా చేయాలి..?**

ప్రస్తుత ఖరీఫ్ ధాన్యం కొనుగోలు ప్రక్రియ వేగవంతంగా జరుగుతున్న నేపథ్యంలో కేంద్రాల వద్ద రైతులకు ఏమైనా ఇబ్బందులు ఎదురైతే ఫోను ద్వారా తమ దృష్టికి తీసుకురావచ్చు. రైతులు తమ సమస్యలను 88866 13611 నంబర్‌కు ప్రతి రోజు ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 6గంటల వరకు ఫోను చేసి సమస్యలను తెలియజేయవచ్చు.

◆ **పీపీసీలలో అన్నిరకాల ధాన్యం కూడా తేమ పేరుతో మిల్లర్లు తక్కువ ధర ఇస్తున్నారనే ఫిర్యాదులపై ఏమంటారు..?**

కొన్ని మా దృష్టికి వచ్చాయి. ఆర్‌బికెల్లో 17 శాతం తేమ ఉంటే మిల్లర్ల వద్ద 19 శాతం ఉంటుందని చెబుతున్నారు. దీనికి నిష్పత్తి ప్రకారం ధర తగ్గిస్తున్నారు. ప్రభుత్వ నిబంధనలు ఖచ్చితంగా పాటించాల్సి ఉంటుంది.

◆ **ధాన్యం సేకరణకు రైతు భరోసా కేంద్ర సిబ్బంది రోజుల తరబడి తిప్పుతున్నారనే ఫిర్యాదులు వస్తున్నాయి, నిజమేనా..?**

రైతులను కేంద్రాల చుట్టూ తిప్పాల్సిన అవసరం లేదు. ధాన్యం నూర్పిడి చేసిన తర్వాత ఈ క్రాప్ నమోదు ప్రకారం కొనుగోలు చేస్తాం. ధాన్యం ఆరబెట్టి 17 శాతం తేమ ఉండే విధంగా రైతులు జాగ్రత్తలు తీసుకోవాలి. ఎలాంటి కారణం లేకుండా రైతులను తిప్పుకుంటే కఠిన చర్యలు తీసుకుంటాం. అందుకే ధాన్యం సేకరణ బాధ్యత కేవలం ఆర్‌బికేలకు అప్పగించకుండా ఎంపిడిఒలు, తహశీల్దార్లకు కూడా బాధ్యతలు అప్పగించాం.

◆ **అక్రమాలను ఎలా అరికడతారు..?**

ధాన్యం కొనుగోళ్లలో ఎలాంటి అక్రమాలు జరిగినా కేసులు నమోదు చేస్తాం. దళారులకు ధాన్యం విక్రయించవద్దు. ఏ-గ్రేడ్ ధర రూ.2060, సాధారణ రకం రూ.2040 మద్దతు ధర. దీని కన్నా ఎక్కువ ధర వస్తే రైతు బయట విక్రయిం చుకునే అవకాశం ఉంది. సన్నరకాలు అంటూ ప్రత్యేకంగా కేటగిరీ లేదు. ఏ-గ్రేడు మాత్రమే ఉంది. రంగు మారిన ధాన్యం కొనుగోలు చేసేందుకు ప్రభుత్వం అనుమతి తీసుకోవాల్సి ఉంది. దీనికి సైతం మార్గదర్శకాలు రావాలి.

యథా ప్రకారం నడిచిన సింహాద్రి ఎక్స్‌ప్రెస్


సామర్లకోట నుండి బయలుదేరిన సింహాద్రి ఎక్స్‌ప్రెస్ రైలు

ప్రజాశక్తి–సామర్లకోట రూరల్

తొలుత రెండు రోజులపాటు ఆది, సోమవారాల్లో పాక్షికంగా రద్దుచేసి సామర్లకోట రైల్వే స్టేషన్ వరకే రాకపోకలు పరిమితం చేసినప్పటికి ఆదివారం యథాప్రకారం సామర్లకోట నుండి సింహాద్రి ఎక్స్‌ప్రెస్ రైలు గుంటూరుకు రాకపోకలు సాగించింది. వివరాలు ఇలా ఉన్నాయి. సామర్లకోట– పిఠాపురం రైల్వే స్టేషన్ల మధ్యలో రైల్వే ట్రాక్‌కు చెందిన ట్రాఫిక్ కమ్ పవర్ బాక్సు ఏర్పాటు పనుల నిమిత్తం ఈ నెల 18, 19 తేదీల్లో ఆదివారం, సోమవారాలు రైల్వే అధికారులు నాలుగు రైళ్ళ రాకపోకలను నిలుపుదల చేస్తూ ఉత్తర్వులు ఇచ్చారు. ఆ ప్రకారం కాకినాడ–విశాఖపట్నంల మధ్య నడిచే 1726, 11728 నెంబరు గల రైళ్ళను రెండు వైపులా రద్దు చేశారు. 17239 నెంబరు గల గుంటూరు–విశాఖపట్నంల మధ్య నడిచే సింహాద్రి ఎక్స్‌ప్రెస్ రైలు సామర్లకోట వరకే రాకపోకలను పరిమితం చేస్తూ 18,19 తేదీల్లో పాక్షికంగా రద్దు చేస్తూ సామర్లకోట గుంటూరు మధ్య నడిచేటట్లు అధికారులు ప్రకటించారు. అయితే అధికారులు సింహాద్రి ఎక్స్‌ప్రెస్ రైలును యథా ప్రకారం నిర్ణీత సమయానికి సామర్లకోట నుండి గుంటూ రుకు బయలు దేరింది. రైల్వే స్టేషఫన్ సూపరింటెండెంట్ రమేష్ పచ్చ జెండా ఊపి రైలుకు క్లియరెన్స్ ఇచ్చారు.

కబడ్డీ రిఫరీ మురళీకుమార్‌కు స్వాగతం


ప్రో కబడ్డీ రిఫరీగా సేవలందిస్తున్న సామర్లకోటకు చెందిన బోగిళ్ళ మురళీ కుమార్ (ఫైల్ ఫోటో)

ప్రజాశక్తి–సామర్లకోట రూరల్

భారత దేశంలో జరగుతున్న ప్రతిష్టాత్మకమైన రెండో అతి పెద్ద ప్రో కబడ్డీ లీగ్‌లో వరుసగా ఏడు సార్లు ప్రో కబడ్డీ రిఫరీగా ఎన్నికై విధులు నిర్వహించిన సామర్లకోటకు చెందిన బోగిళ్ళ మురళీ కుమార్‌కు ఆదివారం సామర్లకోట ఎస్‌బి ఎస్ఆర్ క్లబ్ ఆధ్వర్యంలో నాయకులు రాజమహేంద్రవరం వద్ద మధురపూడి విమానా శ్రయంలో ఘన స్వాగతం పలికారు. ఈ మేరకు జిల్లా కబడ్డీ అసోసియేషన్ కార్యదర్శి కొండపల్లి శ్రీను మాట్లాడుతూ వరుసగా తొమ్మిది సార్లు ప్రో కబడ్డీ రిఫరీగా సేవలందించిన మురళీకుమార్ ఆదివారం బెంగుళూరు నుండి కాకినాడ జిల్లా సామర్లకోటకు వచ్చే క్రమంలో రాజమండ్రి విమానాశ్రయంకు రాగా జిల్లా కబడ్డీ అసోసి యేషన్ ఆధ్వర్యంలో స్వాగతం పలికామన్నారు. సామర్లకోటకు చెందిన మురళీ కుమార్ కబడ్డీ ఆటలో రాణించడమే కాకుండా జాతీయ స్థాయిలో ప్రో కబడ్డీలో రిఫరీగా సేవలందిస్తున్నట్లు చెప్పారు. మురళీ కుమార్ జగ్గంపేట ప్రభుత్వ హైస్కూల్‌లో ఫిజికల్ డైరెక్టర్‌గా విధులు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. జిల్లా కబడ్డీ అసోసియేషన్ నాయకులు, క్లబ్ నాయకులు, క్రీడాకారులు పాల్గొన్నారు.


ఎయిర్‌పోర్టులో మురళీకి స్వాగతం పలుకుతున్న జిల్లా కబడ్డీ అసోసియేషన్, ఎస్‌బిఎస్‌ఆర్‌సి క్లబ్ నాయకులు, క్రీడాకారులు

పన్నులు తప్ప అభివృద్ధి లేని వైసిపి పాలన

ప్రజాశక్తి - పెద్దాపురం

వైసిపి పాలనలో పన్నులు పెంచడం తప్ప అభివృద్ధి ఎక్కడా లేదని ఎంఎల్ఎ నిమ్మకాయల చినరాజప్ప అన్నారు. పెద్దాపురం మండలం దివిలి గ్రామంలో మండల తెలుగుదేశం పార్టీ ఆధ్వర్యంలో ఆదివారం "ఇదేం ఖర్మ మన రాష్ట్రానికి" నిర్వహించారు. గత తెలుగుదేశం ప్రభుత్వ హయాంలో రాష్ట్రంలో జరిగిన అభివృద్ధి గురించి ప్రజలకు వివరించారు. ప్రస్తుత ప్రభుత్వం అధికారంలోకి వచ్చిననాటి నుండి రహదారులు అధ్వాన స్థితిలో ఉన్నాయన్నారు. ప్రజలందరూ టిడిపికి అండగా ఉండి రాబోయే ఎన్నికల్లో టిడిపి విజయానికి తోడ్పడాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో టిడిపి రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి రాజా సూరిబాబు రాజు, మండల టిడిపి అధ్యక్షులు కొత్తిం వెంకట శ్రీనివాసరావు (కోటి), కాకినాడ రామారావు, తిరుపతి సర్పంచ్ మొయిళ్ల కృష్ణమూర్తి, ఎలిసెట్టి నాని, నూనె రామారావు, కంటి బోయిన వెంకటేశ్వరరావు, గోపాలకృష్ణ, మండల టిడిపి నాయకులు, టిడిపి కార్యకర్తలు పాల్గొన్నారు. **ఏలేశ్వరం** మండలంలోని బద్రవరం గ్రామంలో ఇదేమి కర్మ మన రాష్ట్రానికి కార్యక్రమంలో భాగంగా ఆయన ఇంటింటికి తిరిగి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. గ్రామాల్లో నెలకొన్న సమస్యలు పరిష్కరించడంలో ప్రభుత్వం పూర్తిగా విఫల మైందని ప్రత్తిపాడు టిడిపి ఇన్చార్జ్ వరుపుల రాజా అన్నారు.ఈ సందర్భంగా రాజ మాట్లాడుతూ గ్రామీణ రోడ్లు అద్వానంగా ఉన్నాయన్నారు. కార్యక్రమంలో మాజీ జడ్పిటిసి జ్యోతుల పెదబాబు, మండల పార్టీ అధ్యక్షుడు సూతిబూరయ్య, జిగటాపు సూరిబాబు, నీలి సత్తిబాబు, కాటుపల్లి శామ్యూల్, పసుపులేటి శీను ప్రసాద్, సీమల రాంబాబు, లోకతాటి ఈశ్వరుడు, బెల్లం శ్రీను, పెంటకోట శ్రీధర్, పలివెల వెంకటేశ్వరరావు ఉన్నారు.


భద్రవరంలో ప్రజల సమస్యలు తెలుసుకుంటున్న వరుపుల రాజా


దివిలిలో కరపత్రాలు పంపిణీ చేస్తున్న ఎంఎల్ఎ చినరాజప్ప

పిడిఎస్ బియ్యం పట్టివేత

ప్రజాశక్తి–ఉప్పలగుప్తం

అక్రమంగా తరలిస్తున్న పిడిఎస్ బియ్యాన్ని శనివారం రాత్రి పోలీసులు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశారు. ఎస్ఐ జి.వెంకటేశ్వరరావు తెలిపిన వివరాల మేరకు మామిడికుదురు మండలం పాశర్లపూడి నుంచి టాటాఏస్ వాహనంపై మూడు టన్నుల పిడిఎస్ బియ్యాన్ని తరలిస్తుండగా విలసవిల్లి వద్ద వాహనాన్ని పట్టుకున్నామని ఎస్ఐ తెలిపారు. బియ్యాన్ని అక్రమంగా తరలిస్తున్న పాశర్లపూడికి చెందిన బొరుసు కన్నబాబుతో పాటు వ్యాన్ డ్రైవర్‌పై కేసు నమోదు చేశామని తెలిపారు.

వైద్య ఖర్చుల కోసం మానవత సాయం

ప్రజాశక్తి–తాళ్లపూడి

వైద్య విద్య ఖర్చుల కోసం ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్న వారికి సహాయపడటానికి మానవత సేవా సంస్థ అన్నివేళలా అందుబాటులో ఉంటుందని మండల మానవతా శాఖ అధ్యక్షులు జోడాల వెంకటేశ్వర రావు అన్నారు. హీమోఫిలియా వ్యాధితో బాధ పడుతున్న, కొత్త పట్టిసీమ గ్రామానికి చెందిన గుండెపల్లి సునీల్‌కు రూ.ఐదు వేల ఆర్థిక సహాయాన్ని ఆదివారం అందజేశారు. ఈ కార్యక్రమంలో జోడాలతో పాటు గ్రామ సర్పంచ్ మైగాపుల దుర్గాప్రసాద్, మానవత కార్యదర్శి సాయిన సుబ్బారావు, ఇసి సభ్యుడు సనపల రాజశేఖర్, అధ్యక్షులు అప్పన చంద్రధర గుప్త తదితరులు పాల్గొన్నారు.

గోశాల నిర్మాణానికి శంకుస్థాపన


శంకుస్థాపన చేస్తున్న మూర్తి దంపతులు

ప్రజాశక్తి-కడియం

ప్రాచీన చరిత్ర కలిగి, గోదావరీ తీరంలోని ఉన్న భ్రమరాంబికా మల్లేశ్వర స్వామి ఆలయ ప్రాంగణంలో గోశాల నిర్మాణానికి ఆదివారం ధర్మకర్తల మండలి చైర్మన్ ఆర్ఎస్ఎన్ మూర్తి దంపతులు భూమి పూజ నిర్వహించారు. ఆలయ అర్చకులు అప్పల శ్రీమన్నారాయణ ఆధ్వర్యంలో వేద పండితులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. వైసిపి రాష్ట్ర కార్యదర్శి గిరిజాల బాబు కృషి మేరకు, ఎపి పేపర్ మిల్ తమ సిఎస్ఆర్ నిధులను రూ.30 లక్షలు ఈ గోశాల నిర్మాణానికి మంజూరు చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఇఒ వి.వి.శ్రీనివాసరావు, గిరజాల నాగేశ్వరరావు, ఉప్పులూరి హనుమంతరావు, దాసరి శేషగిరి, కొత్తూరి బాలనాగేశ్వరరావు, వేదాంతం చక్రపాణి, గారపాటి తాతబ్బాయి, వట్టికూటి వెంకటరమణ, పూడి వీరబ్రహ్మం, ఆనెం సరస్వతి, వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

బ్యాడ్మింటన్ పోటీలకు విద్యార్థుల ఎంపిక

ప్రజాశక్తి - ఉండ్రాజవరం

ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా స్థాయి స్కూల్ గేమ్ ఫెడరేషన్ అండర్ -17, అండర్-14 పోటీలు బ్రాహ్మణగూడెంలో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా జరిగిన బాల్ బ్యాడ్మింటన్ పోటీలో ఉండ్రాజవరం పాఠశాల విద్యార్థినీ విద్యార్థులు రాష్ట్రస్థాయికి ఎంపికైనట్లు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు విశ్వప్రసాద్ తెలిపారు. అండర్ 17 బాలుర విభాగంలో కె.ఆనంద్, బాలికల విభాగంలో బి.దీపిక, ఎన్.సులోచన, అండర్ 14 బాలుర విభాగంలో సిహెచ్.వంశీ శ్రీరామ్, బాలికల విభాగంలో కె.జాహ్నవి, ఎన్.భారతి ఎంపికయ్యారు. ఎంపికైన విద్యార్థులను పేరెంట్స్ కమిటీ చైర్మన్ సోంబాబు, ఉపాధ్యాయులు అభినందించారు.

'అభివృద్ధి లేదు అంతా అరాచకమే...'

ప్రజాశక్తి - కొత్తపేట

వైసిపి పాలనలో రాష్ట్రంలో అభివృద్ధి లేదు అంతా అరాచకమేనని టిడిపి రాష్ట్ర ఉపాధ్యక్షుడు బండారు సత్యానందరావు అన్నారు. ఆదివారం వాడపాలెంలో 'ఇదేం ఖర్మ మన రాష్ట్రానికి' కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో బండారు పాల్గొన్నారు. గ్రామస్తులను కలుసుకొని వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడారు. వైసిపి పాలనలో అభివృద్ధిని పక్కన పెట్టి దౌర్జన్యంతో అరాచకాలు సాగిస్తున్నారన్నారు. వచ్చే ఎన్నికల్లో వైసిపిని చిత్తుగా ఓడించాలని ప్రజలకు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో చీకట్ల అబ్బు, బండారు బులితాత, బండారు ధనరాజు, బండారు సందీప్, గుత్తుల ధనరాజు, బండారు వీరబాబు, త్సామ శ్రీనివాస్, కట్ట శ్రీను, కోలా రాంబాబు, కడియం చిన్న, బండారు రాజేష్, పప్పుల బుజ్జి, బండారు దొరబాబు, నాయకులు పాల్గొన్నారు

ప్రకృతి వ్యవసాయంపై అవగాహన

ప్రజాశక్తి–ఐ పోలవరం

తిల్లకుప్ప పంచాయతీ పరిధిలో ఉన్న రైతులకు ప్రకతి వ్యవసాయంపై ఆదివారం అవగాహనా సదస్సును నిర్వహించారు. ఆ శాఖ ఎల్-2 ఉద్యోగి మధు ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ సదస్సుల్లో ప్రకతి వ్యవసాయం జిల్లా ఇన్ ఛార్జ్ బి.దేవి హాజరై మాట్లాడారు. రబీలో సన్నాలు, ఆర్ఎన్ఆర్ రకాల వరి సాగుతో రైతులకు అధిక ఆదాయం వస్తుందన్నారు. సన్నాలకు మార్కెట్ ధర కంటే 15 శాతం అధిక ధరకు ఆర్‌బికెల్లో తీసుకుంటారన్నారు. ప్రకృతి సాగు పద్ధతుల ద్వారా పండించిన ఈ ధాన్యాన్ని తిరుమల తిరుపతి దేవస్థానానికి సరఫరా చేస్తామని తెలిపారు. దీన్ని దష్టిలో ఉంచుకొని రైతులందరూ లాభసాటి పంటలను పండించుకోవాలని సూచించారు. అనంతరం రైతు రాజేష్ కొబ్బరితోటలో ఆర్‌డిఎస్ విత్తనాలను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో రైతులు సుధ, వీరన్న, చంటిబాబు, శ్రీను, అశోక్, సూర్యనారాయణ, స్వామినాయుడు పాల్గొన్నారు

పలువురికి కుందుల పరామర్శ

ప్రజాశక్తి - ఉండ్రాజవరం

మండలంలోని వేలివెన్ను గ్రామానికి చెందిన టిడిపి నాయకులు వాకలపూడి వెంకటరత్నం మామ బూరుగుపల్లి నారాయణ మూర్తి ఇటీవల మరణించారు. పార్టీ నిడదవోలు నియోజకవర్గం నాయకులు కుందుల సత్యనారాయణ ఆదివారం వేలివెన్నులోని వెంకటరత్నం కుటుంబ సభ్యులను కలసి పరామర్శించారు. ఆయన వెంట పలువురు తెలుగుదేశం కార్యకర్తలు పాల్గొన్నారు.

నేరాలు ఘోరాలు

చెరువులో పడి మహిళ మృతి

ప్రజాశక్తి - ఉండ్రాజవరం

ప్రమాదవశాత్తూ వివాహిత చెరువులో పడి మృతి చెందిన సంఘటన ఉండ్రాజవరం శివారులో చోటు చేసుకుంది. పోలీసులు, కుటుంబ సభ్యులు తెలిపిన వివరాలి.. కొంతకాలంగా మతురాలు దొడ్డా సింహాచలం (34) మానసిక సమస్యలతో బాధపడుతూ నిద్రలో లేచి బయటకి వెళ్లేంది. తనకు తానే మరల తిరిగి వచ్చేది. కానీ ఆదివారం తెల్లవారుజామున ఇంటి నుంచి బయటకెళ్లి ఎప్పటిలా తిరిగి రాకపోవడంతో ఆమె కోసం గాలించారు. చెరువులో విగతజీవిగా కనిపించడంతో కుటుంబ సభ్యులు కన్నీరు మున్నీరయ్యారు. భర్త వెంకటరత్నం ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ రామారావు తెలిపారు.

వెలంపేటలో బంగారం చోరీ

ప్రజాశక్తి - సీతానగరం

శనివారం సీతానగరం వెలంపేటలో బంగారం దొంగిలించిన సంఘటనపై సీతానగరం పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు నమోదు చేశారు. వెలంపేటకు చెందిన ఆకుల విజేత ఇచ్చిన ఫిర్యాదు వివరాలు ఇలా ఉన్నాయి. శనివారం రాత్రి చిన్న కూతురుతో కలిసి రాత్రి పది గంటల తరువాత ఇంట్లో నిద్రపోయారు. భర్త ఒడిషాలో ఇంజనీర్‌గా పని చేస్తూ అక్కడే ఉన్నారు. ఆదివారం తెల్లవారుజామున బండి బయట ఉందని ఇంట్లో అద్దెకు ఉంటున్న వ్యక్తి తెలిపారు. లోపల ఉండే బండి బయట ఉండటం ఏమిటని తలుపులు తెరిచి చూడగా ఇంట్లో దొంగలు పడి బంగారం అపహరించినట్లు గుర్తించారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ శుభ శేఖర్ తెలిపారు.

కోడిపందేలపై దాడి ఐదుగురు అరెస్టు

ప్రజాశక్తి - సీతానగరం

బొబ్బల్లంక గ్రామ శివారులో ఆదివారం సాయంత్రం కోడిపందేలప ఎస్ఐ శుభ శేఖర్ ఆధ్వర్యంలో దాడులు నిర్వహించారు. కొంతమూరుకు చెందిన పెంద్ర వెంకటేష్, రాజమండ్రికి చెందిన మర్నే శివకుమార్, ఉండేశ్వరపురానికి చెందిన ఈసారపు సురేష్, రేలంగి వినోద్, సింగదల సత్తియ్యను అరెస్టు చేశారు. వారి వద్ద నుండి రూ.4160 నగదు, రెండు కోడి పుంజులు, 2 కోడి కత్తులను స్వాధీనం చేసుకున్నారు.



రచయితల మహాసభలకు శిఖామణికి ఆహ్వానం

ప్రజాశక్తి-యానాం

ప్రపంచ తెలుగు రచయితల సంఘం ఆధ్వర్యంలో ఈ నెల 23, 24 తేదీలలో విజయవాడలో జరిగే 5వ ప్రపంచ తెలుగు రచయితల మహా సభలకు తనకు ప్రత్యేక ఆహ్వానం అందినట్టు యానాంకు చెందిన ప్రముఖ కవి, కవిసంధ్య పత్రిక సంపాదకులు డాక్టర్ శిఖామణి తెలిపారు. ఈ మేరకు ఒక ప్రకటన విడుదల చేశారు. మహాసభల రెండోరోజు 24న నందమూరి తారక రామారావు వేదికపై మధ్యాహ్నం నిర్వహించే పత్రికా ప్రతినిధుల సదస్సు సదస్సుకు శిఖామణి అధ్యక్షత వహించను న్నారు. ఈ మేరకు ప్రపంచ రచయితల సంఘం అధ్యక్ష, కార్యదర్శులు డా. జి. వి. పూర్ణ చందు, గుత్తి కొండ సుబ్బారావుల నుండి తనకు లేఖ అందినట్టు శిఖామణి తెలిపారు. ఈ సభలో బింమ్, రెంటాల జయదేవ్, సిరేలా సన్యాసి రావు, చలపాక ప్రకాష్, ఈతకోట సుబ్బారావు, ఇందూ రమణ, జాబాలి జయచంద్ర, ఘంటా విజయకుమార్ తదితర ప్రముఖులు పాల్గొంటారని ఆయన తెలిపారు.

సమస్యలపై వినతులు

దేవరపల్లి : దేవరపల్లి క్యాంపు కార్యాలయంలో ఆదివారం గోపాలపురం ఎంఎల్ఎ తలారి వెంకట్రావు ప్రజల నుంచి వారి సమస్యలపై వినతులు స్వీకరించారు. నియోజవర్గంలోని అనేక గ్రామాల నుంచి ప్రజలు కార్యాలయానికి వచ్చి ఎంఎల్ఎకు తమ సమస్యలను విన్నవించారు. ఎంఎల్ఎ మాట్లాడుతూ తన దృష్టికి వచ్చిన సమస్యలను పరిష్కరిస్తానన్నారు. ప్రజల సమస్యలు ఎప్పటికప్పుడు పరిష్కరించేలా అధికారులు పనిచేయాలని సూచనలు చేశారు.